


# భయపడకుడి

**మూల వాక్యము:- హెబ్రీ 2:14,15**

కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములు గల వారైనందున ఆ ప్రకారమే మరణము యొక్క బలము గల వానిని అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుటకును జీవితకాలమంతయు మరణ భయము చేత దాస్యమునకు లోబడిన వారిని విడిపించుటకును ఆయన కూడ రక్త మాంసములలో పాలివాడాయెను.

భయం అనేది సాతాను చేతిలో ఉన్న బలమైన ఆయుధం. సమస్త మానవాళిని "మరణ భయము" అనే ఆయుధంతో సాతానుడు వానికి దాసులుగా లోపరుచుకొన్నాడని వాక్యము తెలియజేస్తుంది. (హెబ్రీ 2:14,15)

నేటి దినాలలో ప్రజలు చాలా విషయాలకు భయపడుచున్నారు. పిల్లలకు పరీక్షలంటే భయము. ఉద్యోగము రాదేమోనని భయము. వివాహము కాదేమో అనే భయము ఆలా ఆలోచిస్తూ వెళితే మనిషి భయపడని అంశం లేదేమో అనిపిస్తుంది. ప్రతి దినం భయంతో బ్రదుకుచున్నాడు మనిషి.

"భయపడకుడి" దేవుని యొద్ద నుండి గొప్ప అభయము పరిశుద్ధ గ్రంధం సమస్త మానవాళికి ఇచ్చింది. భయపడకుడి అని పరిశుద్ధ గ్రంధంలో 365 సార్లు వ్రాయబడి ఉంది. అంటే సంవత్సరములో 365 రోజులు కూడ దేవుడు ప్రజలకు ఇచ్చే ఒక సందేశం ఏంటంటే "భయపడకుడి"

**పరిశుద్ధ గ్రంధం "భయపడకుడి" అని చెప్పున్న కొన్ని ప్రత్యేక సంధర్భాలను ధ్యానం చేసుకుందాం :-**

1. **మీ పోషణను గురించి భయపడకుడి: ఆది 50:21** కావున భయపడకుడి, నేను మిమ్మును మీ పిల్లలను పోషించెదనని చెప్పి వారిని ఆదరించి వారితో ప్రీతిగా మాటలాడెను.
2. **మనుష్యులు పెట్టు నిందకు భయపడకుడి: యెష 51:7** నీతి అనుసరించు వారలారా, నా మాట వినుడి. నా బోధను హృదయమందుంచుకొన్న జనులారా, ఆలకించుడి. మనుష్యులు పెట్టు నిందకు భయపడకుడి వారి దూషణ మాటలకు దిగులు పడకుడి.
3. **బెదిరింపులకు భయపడకుడి: 1పేతు 3:14** మీరొకవేళ నీతి నిమిత్తము శ్రమ పడినను మీరు ధన్యులే; వారి బెదిరింపులకు భయపడకుడికలవరపడకుడి;
4. **వదంతులకు భయపడకుడి: యిర్మీ 51:46** ఏటేట వదంతి పుట్టుచు వచ్చును దేశములో బలాత్కారము జరుగుచున్నది. ఏలిక లేచుచున్నాడు దేశములో వినబడు వదంతికి భయపడకుడి మీ హృదయములలో దిగులు పుట్టనియ్యకుడి.

**5. ఆకాశమందు కనిపించే చిహ్నములకు భయపడకుడి: యిర్మీ 10:2** యెహోవా సెలవిచ్చునదేమనగా అన్యజనముల ఆచారముల నభ్యసింపకుడి, ఆకాశమందు అగపడు చిహ్నములకు జనములు భయపడును, అయితే మీరు వాటికి భయపడకుడి.

**6. అన్యులు భయపడు వాటికి మీరు భయపడకుడి: యెష 8:12** ఈ ప్రజలు బందుకట్టు అని చెప్పునదంతయు బందుకట్టు అనుకొనకుడి. వారు భయపడుదానికి భయపడకుడి దాని వలన దిగులుపడకుడి.

**7. గొప్ప సైన్యమును చూచి భయపడకుడి: 2దిన 20:15** యూదా వారలారా, యెరూషలేము కాపురస్థులారా, యెహోషాపాతు రాజా, మీరందరును ఆలకించుడి; యెహోవా సెలవిచ్చునదేమనగా ఈ గొప్ప సైన్యమునకు మీరు భయపడకుడి, జడియకుడి, యీ యుద్ధము మీరు కాదు దేవుడే జరిగించును.

**8. శత్రువులతో యుద్ధము చేయుటకు భయపడకుడి: ద్వితి 20:3** ఇశ్రాయేలీయులారా, వినుడి, నేడు మీరు మీ శత్రువులతో యుద్ధము చేయుటకు సమీపించియున్నారు. మీ హృదయములు జంకనియ్యకుడి, భయపడకుడి.

**నెహె 4:14** అంతట నేను లేచి చూచి ప్రధానులతోను అధికారులతోను, జనులతోను – వారికి మీరు భయపడకుడి, మహాఘనుడును భయంకరుడగు యెహోవాను జ్ఞాపకము చేసికొని మీ సహోదరుల పక్షముగాను మీ భార్యల పక్షముగాను మీ నివాసము మీకుండునట్లు యుద్ధము చేయుడి అంటిని.

**9. బబులోను రాజుకు (రాజులకు) భయపడకుడి: యిర్మీ 42:11** మీరు బబులోను రాజునకు భయపడుచున్నారే; అతనికి భయపడకుడి. అతని చేతిలో నుండిమిమ్మును తప్పించి మిమ్మును రక్షించుటకు నేను మీకు తోడైయున్నాను. అతనికి భయపడకుడి.

**10. విగ్రహములకు భయపడకుడి: యిర్మీ 10:5** అవి తాటి చెట్టు వలె తిన్నగా ఉన్నవి, అవి పలుకవు నడువనేరవు గనుక వాటిని మోయవలసిన వచ్చెను. వాటికి భయపడకుడి అవి హాని చేయనేరవు. మేలు చేయుట వాటి వలన కాదు.

**11. దేవతలకు భయపడకుడి: న్యాయా 6:10** మీరు అమోరీయుల దేశమున నివసించుచున్నారు, వారి దేవతలకు భయపడకుడి అని మీతో చెప్పితిని గాని మీరు నా మాట వినకపోతిరి.

**12. ఆత్మను చంపనేరక దేహమునే చంపు వారికి భయపడకుడి: మత్త 10:28** మరియు ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి గాని ఆత్మను దేహమును కూడ నరకములో నశింపజేయ గల వానికి మిక్కిలి భయపడుడి.

**లూకా 12:4** నా స్నేహితులైన మీతో నేను చెప్పునదేమనగా దేహమును చంపిన తరువాత మరేమియు చేయనేరని వారికి భయపడకుడి.

**దేవుడు ఎందుకు భయపడకుడి అని చెబుతున్నాడో వాక్యములో గమనిద్దాం:**

**1. మనము పిచ్చుకల కంటే శ్రేష్ఠులముగా నిర్మించబడ్డాము గనుక:మత్త 10:31** మీ తల వెండ్రుకలన్నియు లెక్కింపబడియున్నవి. గనుక మీరు భయపడకుడి: మీరనేకమైన పిచ్చుకల కంటె శ్రేష్ఠులు.

**లూకా 12:7** మీ తల వెండ్రుకలన్నియు లెక్కింపబడియున్నవి. భయపడకుడి: మీరు అనేకమైన పిచ్చుకల కంటె శ్రేష్ఠులు కారా?

**2. దేవుడు మనకు మేలు చేయాలనుకుంటున్నాడు గనుక: జెక 8:15** ఈ కాలమున యెరూషలేమునకును యూదా వారికిని మేలు చేయ నుద్దేశించుచున్నాను గనుక భయపడకుడి.

**3. దేవుడే మనకు సహాయము చేయుచున్నాడు గనుక: యెష 41:14** పురుగు వంటి యాకోబూ, స్వల్పజనమగు ఇశ్రాయేలూ, భయపడకుడి నేను నీకు సహాయము చేయుచున్నాను అని యెహోవా సెలవిచ్చుచున్నాడు.నీ విమోచకుడు ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడే.

**4. దేవుడే మనకు తోడైయున్నాడు గనుక: సంఖ్యా 14:9** మెట్టుకు మీరు యెహోవా మీద తిరుగబడకుడి, ఆ దేశ ప్రజలకు భయపడకుడి,వారు మనకు ఆహారమగుదురు,వారి నీడ వారి మీద నుండి తొలగిపోయెను యెహోవా మనకు తోడైయున్నాడు. వారికి భయపడకుడనిరి. ఆ సర్వ సమాజము వారిని రాళ్లతో కొట్టి చంపవలెననగా

**5. విడువని యెడబాయని దేవుడు మనతో కూడ వచ్చును గనుక: ద్వితి 31:6** భయపడకుడి, వారిని చూచి దిగులుపడకుడి, నీతో కూడ వచ్చువాడు నీ దేవుడైన యెహోవాయే; ఆయన నిన్ను విడువడు నిన్నెడబాయడు.

**6. దేవుడే మన పక్షముగా యుద్ధము జరిగించును గనుక: 2దిన 20:15** యూదా వారలారా, యెరూషలేము కాపురస్థులారా, యెహోషాపాతు రాజా, మీరందరును ఆలకించుడి; యెహోవా సెలవిచ్చునదేమనగా ఈ గొప్ప సైన్యమును మీరు భయపడకుడి, జడియకుడి, యీ యుద్ధము మీరు కాదు దేవుడే జరిగించును.

**7. దేవుని ఆత్మ మన మధ్య ఉన్నది గనుక: హగ్గ 2:5** మీరు ఐగుప్తు దేశములో నుండి వచ్చునప్పుడు నేను మీతో చేసిన నిబంధన జ్ఞాపకము చేసికొనుడి; నా ఆత్మ మీ మధ్యన ఉన్నది గనుక భయపడకుడి.

దేవుని పిల్లలమైన మనము పైన చెప్పబడిన వాటిలో దేనికి కూడ భయపడకూడదు. ఎందుకంటే సాక్ష్యత్తు దేవుడే మనపక్షమున ఉన్నాడు. మనకు తోడుగా ఉన్నాడు. మనలను ఆయన నడిపించుచున్నాడు. గనుక మన ఆత్మీయయాత్రలో దేవునికి తప్ప దేనికి కూడ భయపడని వారముగా జీవించగలిగిన కృప ఆత్మ దేవుడు మనకందరికి అనుగ్రహించును గాక! ఆమేన్... ఆమేన్... ఆమేన్...